# కేశ సంహారం

గుండురావుకి శనివారాల్లో సాధారణంగా పెద్దగా గిరాకీ ఉండదు. ఈ శని తనకు శనిగా ఎందుకు దాపురిస్తున్నదా అని అతను తరుచూ ఆలోచన చేసేవాడు. పెద్ద పెద్ద హెయిర్ కటింగ్ సెలూన్స్‌లో తను శిక్షణ పొందాడు. దిగ్విజయంగా ప్రొబేషనూ పూర్తిచేశాడు. దీని మూలంగా ఒక నల్లని పిల్ల మెడలో తాళి కట్టాడు. ఆమె తెచ్చిన కట్నంతో స్వంతంగా ఒక షాపునూ తను ప్రారంభించ గలిగాడు. సికింద్రాబాద్‌లోని ఒక మంచి సెంటర్‌లో స్థాపించిన తన షాపుకు కావాల్సిన సామాగ్రినంతా తన మామే సమకూర్చాడు. ఆంజనేయుని పరమభక్తుడైన గుండురావు తన షాపుకు హనుమాన్ హెయిర్ కటింగ్ సెలూన్ "ఎ.సి." అని నామకరణం చేశాడు.

పెద్ద పెద్ద ఎయిర్ కండిషన్డ్ బార్బర్ షాపుల్లో జరిగే దోపిడీ విధానాలు గుండురావుకి తెలియనివి కావు. ఒక మాసం పెరిగిన జుట్టును, కట్‌చేయించకుండా, మరో పదిహేను రోజులు పెరగనిస్తే సంవత్సరంలో తనకు నాలుగు కటింగ్‌ల ఖర్చు కలిసి వస్తుందన్న ఆలోచన సగటు మనిషికి ఉండటం సహజం. ఇలాంటి ఒక వ్యక్తి, ఒక పెద్ద బార్బర్ షాపుకు వెళ్ళి, సమశీతల ఏర్పాటు చేసి ఉన్న లోపలి భాగంలో సుఖంగా ఆసీనుడై, క్షురకుడు వేసే కుశల ప్రశ్నలకు ఉబ్బిపోయి, "మే ఐ షాంపూ యు సార్" అని అతడు ప్రశ్నిస్తే "వద్దు" అన్న నెగటివ్ సమాధానం ఇచ్చే స్థితిలో మాత్రం ఉండదు. తల కడగటానికి మహా అయితే ఒక అయిదు రూపాయలు మాత్రమే అవుతుందని ఆ శుద్ధ అమాయకుడు భావిస్తాడు. ఆ శుద్ధి కార్యక్రమం ముగుస్తున్న సందర్భంలో "వాటెబవుట్ ఎ లిటిల్ మెనిక్యూర్ అండ్ పెడిక్యూర్" అంటూ క్షురకుడు వినమ్రంగా అడిగినప్పుడు దీనికి పెద్దగా ఖర్చుండదులే అనుకొంటూ ఆ ప్రకారంగా తలూపుతాడు మన శుద్ధుడు. తీరా షాపు నుండి బయటపడే సమయానికి తిరుక్షవరం అయిపోయిన వ్యక్తిలా ఒక వందరూపాయలు పైనే చెల్లించి బయట పడాల్సి వస్తుంది. కొత్తగా వచ్చే కష్టమర్లు ఇది మహాపరాధంగా భావించినా ఆ నల్లడబ్బు అధిపతుల గారాల తనయులు దీనినే ఒక విలాసవంత చర్యగా తలపోస్తున్నందువలన బార్బర్ షాపుల ఆదాయానికి "ఏలోటూ" ఉండటం లేదు.

కానీ మన గుండురావు ఏ.సి. బార్బర్ షాపులో ఇటువంటి దోపిడీ ఏదీ జరగటంలేదు. మరి ఈ ఎయిర్ కండిషన్డ్ షాపును ఎట్లా నడిపిస్తున్నాడు? ఇక్కడే గుండురావు తన లౌక్యాన్ని ప్రదర్శించాడు. "ఎ.సి." అంటే ఎయిర్ కూలర్ అయినా కావచ్చు కదా! కింగ్‌కాంగ్ అదుపులేని

తిండిలా, విద్యుత్ అనే ఇంధనాన్ని ఎయిర్ కండిషనర్ విపరీతంగా స్వాహా చేస్తున్నప్పుడు, దాదాపు ఇదే ఫలితాన్నిస్తున్న ఎయిర్ కూలర్ కరెంట్ భోజనాన్ని కొద్ది మొత్తంలోనే తిని, తన ఆకలిని తీర్చుకోవటానికి ఎక్కువ మోతాదులో నీటిని తాగి, శీతల సేవ అనే మానవ సేవను చాలా చౌకగా అందిస్తూ ఉంది. ముప్ఫై వేలు ఖరీదు గల ఎయిర్ కండీషనర్ ఎంత సుందరంగా కన్పిస్తుందో, అంతే అందమైన రూపంగల ఎయిర్ కూలర్ అయిదు వేలకే లభిస్తున్నప్పుడు, కళ్ళు తిరిగే కరెంట్ బిల్లు నందించే ఎయిర్ కండిషనర్‌ను కొనటమెందుకు? తన షాపుకు వచ్చే కష్టమర్లను డబ్బు గురించి ఇబ్బంది పెట్టకూడదన్నదే గుండురావు ఆలోచన. ప్రతి మంగళవారం షాపుకు సెలవు దినం. అతని ఒకే ఒక అసిస్టెంట్ వారానికి అయిదురోజులే పనికి హాజరవుతాడు. అందువల్ల లాభమే తప్ప ఎటువంటి కష్టమూ లేదు, గుండురావుకి, ఎందువల్లనంటే, అసిస్టెంట్‌కు ముట్టజెప్పేది తలకింతనే గాని, నెలకింతని గాదు. ఇంతే కాకుండా, శనివారం షాపు కొచ్చే మనుషులూ స్వల్పమే. అయినా ఆ రోజు గుండురావు ఒక్కడే షాపులో ఉండటంతో అతనిలో ఏ కారణం చేతనో ఆత్మన్యూనతా భావం తలయెత్తేది. శనివారం వచ్చే కష్టమర్లు ఒక్క పనిమనిషి గూడా లేని తన షాపును చూసి కుటీర పరిశ్రమగా పరిగణిస్తారేమో అన్న శంకే గుండూరావుది. ఏకోపాధ్యాయ పాఠశాలలో అటెండరూ, గుమస్తా, టీచరూ, సర్వం తానే అయి సర్దుకుపోతూ సమతమతమయ్యే ఉపాధ్యాయుని అవస్థే శనివారం నాడు షాపుకు వచ్చే వ్యక్తుల్ని చూసినప్పుడు గుండురావు అనుభవించేవాడు. అయినదానికీ, కానిదానికీ పరుల ముందు భార్యని తిట్టిపోసి గొప్పగా చెలామణీ కావాలనుకొనే భర్తలా, ఆ అయిదురోజులూ తన అసిస్టెంట్ చేసే పనిని అజమాయిషీ చేస్తూ గడిపేవాడు, గుండురావు. కానీ శనివారం మాత్రం క్రితం రోజు ప్రక్కింటి కుర్రాడితో భార్యలేచిపోతే, సిగ్గుతో చితికిపోయే భర్తలా దిగజారిపోయే వాడు గుండూరావు. ఒక లాయర్ కొత్తగా కార్యాలయాన్ని ప్రారంభించి, కుటుంబ గౌరవాన్ని ఏమాత్రం దృష్టిలో పెట్టుకోకుండా కోర్టుల చుట్టూ తిరిగే కోర్టు పక్షి రాకకోసం ఎదురుతెన్నులు చూసినట్లుగా... ఇద్దరు ముగ్గురు డాక్టర్లు అప్పటికే ఉన్న ఒక చిన్నపట్టణంలో, అప్పుడే యం.బి.బి.యస్. పట్టా పొందిన ఒక యువ డాక్టరు క్లినిక్‌ను ప్రారంభించి రాబోయే రోగి కోసం ఒళ్ళంతా కళ్ళు చేసుకొని చూస్తున్నట్లుగానూ. ... ఆ శనివారం తన ముందు తలవంచుకు కూర్చునే వ్యక్తి రాకకోసం ఎదురుచూస్తూ కాలుగాలిన పిల్లిలా షాపులోపలా, బయటా అదే పనిగా తిరగసాగాడు. ఖాళీగా ఉన్నప్పుడు ఈగల్ని తోలుతూ కూర్చొందామన్నా ఒక్క ఈగైనా గుండురావు ముందుకు రావాలిగా?! పోనీ, ఆనాటి దినపత్రికను చూస్తూ కాలక్షేపం చేద్దామన్నా మాగన్నుపడ్డ కళ్ళు గూడా ఏమాత్రం సహకించటంలేదు. ఆ సమయంలో గరళకంఠుని అత్యంత కలుషితమైన గళం నుండి వెలువడిన కఠిన స్వరంలా ఒక దగ్గు విన్పించి గుండురావు

ఉలిక్కిపడి లేచాడు. కళ్ళు తెర్చి ఎదురుగా నిల్చుని ఉన్న భారీకాయాన్ని చూసి ఇంకా పూర్తిగా కోలుకోని గుండురావు మరోసారి తృళ్ళిపడ్డాడు.

ఆ ఆజానుబాహుడు ముదురాకుపచ్చ ప్యాంటు మీద, అంతే ముదురు నీలం రంగు టీషర్టు ధరించి ఉన్నాడు. ఆ టీషర్టుమీద ఎరుపు, పసుపు పచ్చరంగులతో కూడిన ఒక చైనీస్ డ్రాగన్ బొమ్మ ఉంది. పాదాలకు కొల్హాపురీ స్లిప్పర్స్ వేసుకున్నాడు. అతని కనుబొమ్మలు వెడల్పుగా ఉండి భయం కొలుపుతున్నాయి. వాటి క్రింద వాడి చూపులు గల నేత్రాలు... లావుగా, పొడుగ్గా ఉన్న ముక్కు క్రింద పెద్ద మల్లయోధుని కున్నట్లుగా బుర్రమీసాలు... అతని జులపాల జుట్టు భుజాల మీదకు వ్రేలాడుతూ భరతనాట్యం చేసే వ్యక్తిని జ్ఞప్తికి తెస్తుంది. "ఎవరు మీరు...మేం కావాలి...?" అంటూ వణికిపోతూ ఆ వ్యక్తిని ప్రశ్నించాడు గుండురావు.

"నా భార్య రెండో పెళ్ళి చేసుకోబోతూ ఉంటే మొదటగా నిన్ను పిలవాలని వచ్చాను." గుండూరావు వేసిన ప్రశ్నకు తిక్కరేగి విసుగ్గా సమాధానమిచ్చాడు.

రుచికరంగా, ఉన్న, పొగలుకక్కే వేడి పదార్థాన్ని నోట్లోపెట్టుకొని, అటు మింగలేకా, బయటకు కక్కలేకా విచిత్రమైన అవస్తలో అల్లాడిపోయే వ్యక్తిలా దయనీయంగా ఉండిపోయాడు గుండురావు.

"హనుమాన్ హెయిర్ కటింగ్ సెలూన్ అన్న నీ బోర్డు చూసి లోపల కొచ్చాన్రా సన్నాసీ, అసలు ఈ హనుమంతుడు నాకు గతంలోనే పెద్ద క్షవరం చేశాడు" అంటూ ఆ వ్యక్తి చెప్తున్న తీరు గుండూరావుకు ఏమాత్రం నచ్చలేదు.

"సార్... సార్.. అట్లా అనకండి... దేవునికి కోపమొస్తుంది. తమరికి హెయిర్ కటింగే కావాలి. షేవింగ్ అక్కరలేదు గదూ!" అంటూ నమ్రతతో అన్నాడు గుండూరావు.

"ఫర్వాలేదే, నీ బుర్రలో కొంత బుద్ధి ఉందన్నమాట. అయితే నాకు హెయిర్ కటింగ్ అవసరం లేదు, సొంతం గుండేచేయాలి" అంటూ ఆ పెద్దమనిషి నెమ్మదిగా అన్నాడు.

"సార్... నేను ఎక్స్‌పర్ట్ బార్బర్ని, ఎంతో ఫ్యాషన్‌గా కటింగ్ చేయించుకోవాలనే వాళ్ళే ఇక్కడికొస్తారు. తమరు గుండే చేయించుకోవాలనుకొంటే తిరుపతి పోయుంటే బాగుండేది. పైగా ఈ రోజు శనివారం. ఫ్రీగా చేసేవాళ్ళు."

"గుండు గీయించుకోవడానిక్కూడా పైసల్లేని ఫకీరు ననుకొన్నావా, నన్ను"

"సార్... సార్... కోప్పడకండి అట్లా అనుకోలేదు నేను, పొరపాటేదైనా ఉంటే

మన్నించండి. కానీ ఇంత అందంగా ఉన్న జుట్టును తీసివేయాలంటే ఏ బార్బర్‌కూ చేతులాడవు. పోనీ, ఒక మంచి కొత్తస్టైల్లో కట్ చేయనా? అప్పుడూ తమకు నచ్చలేదంటే గుండు గీస్తాను."

"చూడయ్యా! నీకు ఉన్నంత తీరిక నాకు లేదు, ఎన్నో పనులున్నాయి. కత్తి తీసి త్వరగా ప్రారంభించు."

"ఒక్క సారే వెంట్రుకలన్నీ తీయకూడదు, సార్. ముందు చిన్నవిగా కట్‌చేయాలి. ఆ తర్వాతే పూర్తిగా కత్తితో గుండు చేయాలి. మీ జుట్టుపై మీకేమాత్రం ప్రేమ లేకపోతే, వాటిని పూర్తిగా తీసివేయటానికి నేనొక ఉపాయం చెప్తాను."

"అదేమిటో త్వరగా చెప్పి చావు."

"దానిపేరు యానీ ఫ్రెంచ్ సార్."

"అంటే మహిళా బార్బరా?"

ఆ మాట వింటూనే గుండూరావు పగలబడి నవ్వాడు. ఆ పెద్ద మనిషి కన్నా తన లోకజ్ఞానమే గొప్పదని తలపోస్తూ అన్నాడు.

"అది ఫ్రెంచి నుండి దిగుమతి అయిన ఆడబార్బర్ కాదు సార్. ఈ దేశంలోనే తయారైన ఒక తైలం సార్. దాన్ని తలమీదంతా రాసి తడిగుడ్డతో తుడిస్తే చాలు, ఇక వెంట్రుకనేదే తలపై ఉండదు. ఇహ తలకాయ కోడిగుడ్డులా మెరిపోతుంది. కానీ, ఇందుకు ఖర్చు కొంచెం ఎక్కువ అవుతుంది."

"ఫర్వాలేదు లేవోయి,.... అట్లానే చేయి. అర్జంటు పనిమీద వెళ్ళాలని ముందే చెప్పానుగా, శీఘ్రంగా కానీ..."

"ఇది బార్బర్ షాపులో చేసే పని కాదు సార్, మా వంటి క్షురకుల పొట్ట కొట్టటానికి మా పగవాళ్ళెవరో దీనిని కనిపెట్టారు. నెత్తిమీద వెంట్రుకలు తీయటానికి దీనిని వాడారు. సాధారణంగా, పురుషులు దీనిని వాడరు కాబట్టే మేమంతా బ్రతకగలుగుతున్నాం. కానీ, తలమీద ఇహ వెంట్రుకలే అవసరం లేదనుకునే వాళ్ళెవరైనా దీన్ని వాడటం ఆరంభిస్తే, ఇహ మా బ్రతుకులు బజారున పడ్డట్టే. కొందరికి నుదుటి నుండి తలపై మూడొంతుల భాగం వెంట్రుకలే ఉండవు. ఇటువంటి వాళ్ళే వెనుక కొద్ది భాగంలో ఉన్న వెంట్రుకల్నే మరింత పొడవుగా, దాదాపు ఒకటిన్నర అడుగుల వరకు పెంచుతారు. ఆ వెంట్రుకల్నే మడతపెట్టినొసలు వరకూ తెచ్చి, మళ్ళీ వెనక్కు పోయేట్లుగా సర్దుతారు. నున్నగా ఉన్న తలపై ఆ వెంట్రుకలట్లాగే ఉండిపోవటానికి ఫెవికాల్ వంటి దాన్ని వాడతారేమో! ఇట్లా

వాడకుండా ఆ మిగిలిన పావుభాగం వెంట్రుకల్ని శాశ్వతంగా తీసివేయాలని వాళ్ళు సంకల్పిస్తే అంతర్జాతీయంగా క్షురకులకు ఎన్ని లక్షల డాలర్ల నష్టం సంభవిస్తుందో?"

"ఏంట్రోయ్... నీవు కూడా డాలర్ గూర్చి మాట్లాడుతున్నావా?"

"మన ఆర్థిక మంత్రి దేశానికి ఎంత మేలో చేసినా ప్రత్యేకించి మా వృత్తి వాళ్ళకు జరిగిన మేలేమో. ఆయన మాకేం మన్‌మోహనుడు కాకపోగా, ఆయన కులం వాళ్ళ వల్ల కూడా మాకెటువంటి ప్రయోజనం లేదు. లోకంలో అందరూ డాలర్‌లోనే వ్యవహరిస్తున్నప్పుడు నేనూ దాని గూర్చి మాట్లాడితే తప్పేమిటి?"

"కానీ ఒక విషయం.... నా దగ్గర రూపాయలే ఉన్నాయి. నువ్వు డాలరేకావాలని పట్టుబడితే మరో షాపుకు వెళతాను"

"ఎగుమతీ దిగుమతీ వ్యవహారం లేని నాకెందుకు సార్ డాలర్. తమరు సుఖంగా ఈ కుర్చీలో కూర్చోండి. మీ తలతోనే ఈ రోజు నా వ్యాపారానికి బోణీ కొడతాను. కానీ, ఇంత ముచ్చటైన జుట్టును నిర్దాక్షిణ్యంగా కత్తిరించటానికి నా చేతులు వణుకుతున్నాయి."

ఆ పెద్ద మనిషి కుర్చీలో సుఖాసీనుడైనాడు. ఒడిలో కూర్చొన్న "సయామీస్ పిల్లిని ముద్దుగా నిమురుతున్నట్లుగా, ఆ అందమైన వెంట్రుకల్ని సుతారంగా సవరించసాగాడు గుండురావు. ఒక పెద్ద దువ్వెనతో ఆ వెంట్రుకల్ని లాలనగా దువ్వుతూ గుండూరావు అన్నాడు.

"సార్... తమరింత దారుణమైన నిర్ణయాన్నెందుకు తీసుకున్నారు సార్."

"చెప్తానుండు, ఇప్పుడు నీవు ఆర్థిక మంత్రి పేరు చెప్పావు కాబట్టి, నిన్నొక ప్రశ్న వేస్తాను. జుట్టును కత్తిరించే నీ పని నీవు చేసుకుంటూనే బాగా ఆలోచించి నాకు సమాధానం చెప్పు. ఈ రోజు భారతదేశంలో అత్యంత శక్తిగల వ్యక్తి ఎవరు?

"దారా సింగేకద్సార్"

"అటువంటి శరీరబలం గురించి కాదయ్యా నేనడిగేది."

"మరి హర్షద్ మెహతా కున్న శక్తి వంటిదా సార్?"

"కాదురా ఫూల్"

"అయితే, ప్రధానమంత్రా సార్"

"ప్రధానమంత్రి చెప్పినా లెఖ్ఖ చెయ్యని మనిషి ఎవరైనా ఉన్నారా?"

"ఎందుకుండరు సార్, బాంబేలోని బాల్‌థాకరే ప్రధాని మాటను ఖాతరు చెయ్యడు. అటువంటి ఇంకెందరి పేర్లో నేను చెప్పగలను సార్. ప్రతిపక్షం వాళ్ళు అతని మాటనసలు లక్ష్యపెట్టనేపెట్టరు. విచిత్రమేమిటంటే, స్వంతపార్టీలోనే కొందరు ఆయన మాట పట్టించుకోవడం లేదు."

"సరే... పోనీ..., అధికార పక్షంలోనూ, ప్రతిపక్షంలోనూ ఉన్న నాయకులందరూ ఆ పేరు చెప్తేనే హడలిపోతారు, ఆ వ్యక్తి ఎవరో చెప్పు చూద్దాం" ఎటూ పాలుపోక కొద్ది క్షణాల పాటు గుండురావు బుర్రగోక్కున్నాడు. ఆనాడెప్పుడో ఆర్కిమెడిస్ "యురేకా" అంటూ అర్చినట్లు గుండురావు ఒక్కసారిగా "చీఫ్ ఎలక్షన్ కమీషనర్"అంటూ సంబరపడుతూ గర్వంగా అన్నాడు. ఆ సమాధానంతో ఆశ్చర్యపోయిన ఆ పెద్ద మనిషి తన క్షవరం సంగతి అట్లా ఉంచి గుండురావు తలను తను గొరిగినా ఎటువంటి తప్పూ లేదని భావించాడు. ఇంత తక్కువ విద్యాగంధం ఉన్న ఇతని బుద్ధే ఇంత నిశితంగా ఉంటే, భారతదేశంలోని సాధారణ ప్రజల ఆలోచనా స్థాయి ఎంత గొప్పగా ఉంటుందోనన్న ఆలోచన కలిగింది ఆ పెద్ద మనిషికి.

"సెహభాష్... భలే చెప్పావు. కానీ నీకతని పేరు తెలియదా?"

"తెల్సు సార్,...కానీ చెప్పే ధైర్యం నాకు లేదు. "తమిళనాడు"ను ఇంగ్లీష్‌లో రాసేటప్పుడు దానిలోని రెండు పెద్ద అక్షరాలు ఈయన పేరు ముందు ఉంటాయి గదా సార్?"

"నీవు గొప్ప ప్రజ్ఞాశాలివే, మరి ఆ వ్యక్తి పేరు ఏమిటో చెప్పలేవా?"

"ఆ తెలివి తక్కువ పని నే చేయను సార్. ఆయన ఇంట్లో కాపలాగా డ్యూటీలో ఉండే పోలీస్ కానిస్టేబుల్, ఆంధ్రప్రదేశ్‌లోని మరో పోలీస్ అధికారి చేసిన అనాలోచితపని వంటిది నేను మాత్రం చేయను సార్."

"చక్కగా చెప్పావు, ఇహ నేనూ అతని పేరు ఉచ్చరించను. సరే, అతని హెయిర్‌స్టయిల్ ఏమిటి?"

"ఓహో... నాకర్థమైంది సార్.. గొప్ప ఆరాధనా భావం అనుకరణకు దారి తీస్తుందని పెద్దలెవరో అన్నారు. అంటే, మీరు ఇప్పుడు... వారిని అనుకరించబోతున్నారన్నమాట."

"కాదురా సన్నాసీ..., నాక్కూడా కొంత పవర్‌ను రుచి చూద్దామని ఉందిరా. సాధారణంగా ఒక బ్రాహ్మణుడు రాజ్యాన్నేలుతున్నా అంత శక్తిమంతుడుగా ఉండడు. అదే

కదా బ్రాహ్మణ, క్షత్రియుల మధ్య ఉండే తేడా. ఒక వీర శూర శిఖామణి అన్నపేరు సంపాదించాలనీ, అత్యున్నతమైన అధికార శిఖరానికి చేరాలని నాకూ ఎంతో ఉబలాటం ఉంది. అందుకే, అందుకనుగుణంగా హెయిర్‌స్టయిల్ పెట్టుకోవాలనే నేను భావిస్తున్నాను."

"కానీ, తమర్ని చూస్తే బ్రాహ్మణులని అనిపించరే. బ్రాహ్మణులెప్పుడూ హనుమాన్ వ్యాయామ శాలకు వెళ్ళరే. తమరికింత బలమైన కండరాలెలా వచ్చినై?"

"నా కండరాల గూర్చి తర్వాత చెప్పుకుందాం. తొందరగా పని ముగించు."

మరిక ఆలస్యం చేయకుండా గుండురావు క్షవరం పనిపూర్తిచేసాడు. ఒక టవల్‌తో అతని మెరుస్తున్న నున్నటి గుండును తుడిచి దానికంటుకున్న వెంట్రుకల్ని గట్టిగా విదిలించాడు. విచిత్రం, మళ్ళీ ఆ తలమీద భాగవతారుల కున్నట్లుగా పొడుగాటి జుట్టు.

గుండూరావు ఒక్క క్షణం నిశ్చేష్టుడైనాడు. కళ్ళు నులుముకూంటే ఆశ్చర్యంగా చూస్తే "ఇదేం మాయసార్, మీ తలనిండా మళ్ళీ మామూలు జుట్టు వచ్చేసిందే!"

"నీవు మాట్లాడుతూనే ఉన్నావుగానీ, జుట్టు అసలు కత్తిరించావా?"

"ఇప్పుడే గదా నేను మీ బోడి తలను తుడిచింది."

"ఒరేయ్... కలల జీవీ. నీవు టి.ఎన్.గారి తలను స్వప్నంలో చూసి ఉంటావు, తొందరగా ముగిస్తావా లేదా! నా కవతల అర్జంటు పని ఉందని ముందే చెప్పాను."

ఆశ్చర్య చకితుడైన గుండూరావు ఆశిరో ముండన క్రియను మరింత శీఘ్రంగా ముగించాడు. మళ్ళీ టవల్‌తో గుండు తుడిచి, అటు తిరిగి విదిలించి, ఇటు తిరిగేసరికి.... ఆశ్చర్యం....!ఆ తలనిండా మళ్ళీ వెంట్రుకలే.

"ఏమిటి సార్, ఈ వింత... ఇంకా నేను కల కంటూనే ఉన్నానా? అంటూ బాణామతి పాలబడ్డవాడిలా అడిగాడు గుండూరావు.

"నీవు చెప్పేది నేను కలలు గంటున్నాననా? నీవు చెప్పేది కరక్టో నేను చెప్పేది కరక్టో ఒకసారి ఆ అద్దంలో చూడు."

గుండూరావు అద్దంలోకి పరిశీలనగా చూశాడు. ఆ పెద్దమనిషి చెప్పిందే వాస్తవం. ఆ తలనిండా ఫస్ట్‌క్లాస్ జుట్టు. నా కేంటవుతుంది. అని గుండూరావు బెంబేలెత్తిపోతున్నాడు. తరుచుగా అద్దంలోకి చూస్తూ మళ్ళీ క్షవరం పూర్తి చేసాడు. ఆ అద్దంలో గూడా అద్దంలాంటి అతని బోడి తలను చూసి గుండూరావు ఎంతో సంతోషించాడు. వీధిలో ఏదో శబ్దం అయితే ఆ వైపు చూసి మళ్ళీ వెనక్కి తిరిగే సరికి గుండురావుకి గుండె ఆగినంతపనైంది.

"ఎందుకు, సార్? నన్నిట్లా ఏడిపిస్తున్నారు? కొంపదీసి మీరు పి.సి. సర్కార్ కాదుకదా!"

"ఏరా, సెలూన్‌కు వచ్చేముందు దారిలో సారా ఏమన్నా పుచ్చుకొచ్చావా? లేక ఉదయం టీ, కాఫీలకు బదులు విస్కీబ్రాందీలు పడుతున్నావా?"

"సార్ కొంచెం మెల్లగా మాట్లాడండి... వాళ్ళు గనకవింటే, మీకు, నాకు తెలియని నిజాలెన్నో మనచేత కక్కిస్తారు. నాకు మీరనే అలవాట్లేమీ లేవు."

"అయితే మీ కుటుంబంలో ఎవరికైనా మానసిక రుగ్మత ఏమైనా ఉందా? మీ బంధువులెవరైనా ఎర్రగడ్డలో ఉన్నారా? నా పనిని నీవు త్వరగా ముగించకపోతే నేనే నిన్ను తీసుకెళ్ళి ఎర్రగడ్డలో చేర్పించి వస్తాను. వెంటనే నా పని ప్రారంభించు." గుండూరావుకు నిజంగానే పిచ్చెక్కినట్లైంది. స్లోమోషన్ నుండి రాపిడ్ మోషన్‌లోకి వచ్చినట్లుగా ఆ క్షవరం పరంపరను కొనసాగించాడు. దీనితోపాటు రకరకాల సంభాషణలు కూడా సాగిపోయాయి. ఆ భయంకరుడి బెదిరింపుల భయం వలన తనపనిని మధ్యలో ఆపే వీలు లేకపోయింది, గుండురావుకి. ఆ క్షవర క్రమంలో పదో అధ్యాయంపూర్తి చేసేసరికి శారీరకంగా, మానసికంగా అలసిపోయిన గుండూరావుతో...

"చూసావా, నీ పని ఇప్పుడు పూర్తి అయింది. నీవు చాలా నిదానంగా చేసినా అది నాకు తృప్తికరంగానే ఉంది. కానీ, ఒక్క మాట, వీలైనంత వేగంగా వెళ్ళినీవొక మనో రుగ్మతల డాక్టర్‌ను చూడటం చాలా అవసరం. ఒక్కసారే క్షవరం చేసి, నాలుగైదు సార్లు చేసినట్లుగా నీకనిపించిందంటే నీకేదో మనోరుగ్మత ఉందన్న విషయం స్పష్టమైనట్లే...'

"నాలుగైదు సార్లు కాదు సార్..., తొమ్మిది పదిసార్లు మీకు క్షవరం చేసాను. క్రింద పడిన జుట్టును చూడండి. ఒక్క తల నుండి ఇంత జుట్టు వస్తుందా? ఇప్పుడైనా చెప్పండి, అసలు మీరెవరు? ఇంద్రజాలికులేనా? మీ విశ్వరూపం ఒక్కసారి నాకు చూపుతారా?"

"అట్లాగే తమ్ముడూ... అసలైన కథ ఇప్పుడు నీకు చెప్తాను. పురాణకాలంలో రావణ నామధేయుడైన లంకేశ్వరుణ్ణి నేను. మరి నీవెవరనుకున్నావ్? నా ప్రియమైన సోదరుడివి, విభీషణుడివి. ఆనాటి యుద్ధంలో రామ లక్ష్మణుల్ని నేను సంహరించిన విషయం నీకు మర్చిపోలేదు, కదా! అయితే యుద్ధ చిరలో నా ప్రాణక్షవరం జరగటానికి ప్రధాన కారకుడివి నీవే కదా! అందుకే ఆ రోజు నీకొక శాపం ఇచ్చాను. వచ్చే జన్మలో నీవు క్షురకుడిగా పుడతావన్నదే ఆ శాపం. అధికార కాంక్ష తీరని నా ఆత్మపదునాలుగు లోకాల్నీ పరిభ్రమిస్తునే ఉంది. తిరిగి శ్రీలంకకు నేను వెళ్ళడం ఉచితం కాదు. ఎందుకంటే, నన్ను అక్కడి సైనికులు ఒక తమిళుడిగా ఊహించి కాల్చేయవచ్చు. కాకపోయినా, ఈ కాలంలో కూడా అటువంటి

చిన్న రాజ్యాన్ని మళ్ళీ పాలించినా నాకు తృప్తి ఉండదు. ఎంతో కాలం నుండి, భారతదేశ అత్యున్నతాధికార పీఠాన్ని అలంకరించాలన్న కోరిక నాలో బలంగా ఉంది. ఇందుకు మొట్టమొదటగా చీఫ్ ఎలక్షన్ కమీషనర్ హెయిర్ స్టైల్‌ను అనుసరించాలని నేను నిర్ణయించుకున్నాను. ఇక నీ శాప విమోచన విషయం ... నా పది శిరస్సుల మీద వెంట్రుకనేది లేకుండా నున్నగా గుండు చేశావ్ కాబట్టి, ఈ రోజు నుండి నీకు శాపమోక్షం లభించింది. ఈ వృత్తికిక నీవు స్వస్తిచెప్పవచ్చు. నేనిస్తున్న ఈ పదిరూపాయలతో నీవొక మంచి వ్యాపారాన్ని ప్రారంభించు. చాలా స్వల్ప కాలంలో నీవొక కుబేరుడివే అవుతావు."

"సార్... సార్... సారీ... భ్రాతృశ్రీ... ఒక్క తలకే నేను పదిరూపాయలు ఛార్జీ చేస్తున్నాను. కాబట్టి మీ పది తలల క్షవరానికీ నాకు వంద రూపాయలు ఇవ్వాలి."

"నా ముద్దుల విభీషణా... ఇప్పటివరకు ఏ వ్యక్తైనా నీ వద్ద క్షవరం చేయించుకొని రెండు తలలకు సరిపడ్డ డబ్బులు ఇచ్చారా? నెత్తిమీద మూడు వెంట్రుకలున్నా, హిప్పీలకున్నట్లు మూడు లక్షల వెంట్రుకలున్నా నీకిచ్చే ఛార్జీ ఒకటే కదా! నేనూ ఒక్కణ్ణే కదా! నా కున్నదీ ఒక్కటే శరీరం. కాబట్టి, నేను ఇవ్వవలసింది ఒకటే ఛార్జీ. ఈ డబ్బు తీసుకో... ఇది నీకు గొప్ప భాగ్యం తెస్తుంది." అని చెబుతూ ఒక పాత పదిరూపాయల నోటును గుండురావు చేతిలో పెట్టి అదృశ్యుడైపోయాడు, ఆ పెద్ద మనిషి.

కన్నార్పటం మర్చిపోయిన గుండూరావు రావణుడు అంతవరకు నిలబడి ఉండిన స్థలంవైపే చూస్తూ ఉండిపోయాడు.

"అతను రావణుడే, సందేహం లేదు. కానీ నన్ను విభీషణుడని చెప్పడం మాత్రం డబ్బులు మిగుల్చుకోవటానికే... వేరే ఏ పనీ తెలియని నేను ఈ వృత్తినెట్లా వదులుకోవాలి? ఏది ఏమైనా ఆ పెద్దమనిషి ఈ డబ్బుతో నాకు గొప్ప అదృష్టం పడుతుందని తెలియజేశాడు గదా! అందులో, ఈ పది రూపాయలతో సిక్కిం లేదా భూటాన్ లాటరీ టిక్కెట్టును కొంటాను." అని అనుకుంటున్న గుండూరావును ఇంకొక కొత్త భయం పట్టుకొంది.

"మామూలు శనివారం లాగానే ఈ శనివారం గూడా నాకు చెడ్డగానే పరిణమించింది. ఉదయమే, ఎంత పెద్ద నష్టం ఎదురైంది? ఇంకా, ఈ రోజెలా షణ్ముఖుడు, చతుర్ముఖుడు ఇరువురు కూడా వస్తే, నా నష్టం రెట్టింపవుతుంది! ప్రసన్నాంజనేయా!... ఇహ ముందు నా షాపుకు మామూలు మానవులు తప్ప, మరే దేవతలూ ప్రవేశించకుండా నన్ను రక్షించు స్వామీ...!" అంటూ గట్టిగా కళ్ళు మూసుకొని ప్రార్థించాడు, ఆ రామ భక్త విభీషణుడు.